సాక్షి చిత్తూరు

శనివారం। 24। ఆగస్టు। 2024



ఫ్యాక్టరీ.. నో సేఫ్టీ!

జిల్లాలోని పలు పరిశ్రమల్లో భద్రత కరువైంది. ప్రమాణాలు పాటించకపోవడం ప్రమాదాలకు కారణమవుతోంది. - 8లో



వినూత్న నిరసన

కోల్‌కతా ఘటనపై కుప్పం డిగ్రీ కళాశాల విద్యార్థినులు శుక్రవారం వినూత్నంగా నిరసన తెలిపారు. - 8లో



కక్షతోనే అసత్య కథనాలు

రాజకీయ కక్షతోనే ఎల్లోమీడియా తమపై అసత్య కథనాలు రాస్తోందని వెంకటరెడ్డి యాదవ్ విమర్శించారు. - 8లో

న్యూస్‌రీల్

'బైపాస్' స్థల పరిశీలన



సూచనలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

వి.కోట: మండలంలోని నెర్నిపల్లె వద్ద ఎన్‌హెచ్– 42 వి.కోట బైపాస్ రోడ్డు కోసం ఎన్‌హెచ్ అధికారులతో కలిసి కలెక్టర్ సుమిత్ కుమార్ శుక్రవారం స్థల పరిశీలన చేపట్టారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్‌హెచ్–42లో బైరెడ్డిపల్లెకు 2.35 కిలోమీటర్లు, వి.కోటలకు, 7.5 కిలోమీటర్ల బైపాస్ రోడ్డు సర్వం సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని స్థానిక రైతులు, ప్రజల విన్నపం మేరకు స్థల పరిశీలన చేపట్టినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి , అసిస్టెంట్ కలెక్టర్ మహివంశీ, ఎన్‌హెచ్ ఈఈ అబ్దుల్ సలాం, తహసీల్దార్ పార్వతి పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా రాహుకాల అభిషేకం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

చౌడేపల్లె : బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువనే ఆలయాన్ని శుద్ధి చేసి మామిడి, వేపాకు, పూల తోరణాలతో సుందరంగా ముస్తాబు చేశారు. 10.30నుంచి 12 గంటల మధ్యలో అమ్మవారికి రాహుకాల అభిషేకం జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చిన గంగమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఉభయకర్తలకు ఆలయ ఈఓ ఏకాంబరం తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ క్రమంలోనే సుమారు వెయ్యిమంది భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు.

పీఎఫ్ సమస్యలకు 'నికట్ 2.0'

చిత్తూరు కలెక్టరేట్ : ఉద్యోగుల భవిష్యనిధి సమస్యలను పరిష్కరించేందుకు నిధి అప్కే నికట్ 2.ఓ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఈపీఎఫ్ఓ రీజనల్ కమిషనర్ గౌరవ్ మహల్వా తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 27వ తేదీన చిత్తూరు మురకంబట్టులోని క్యాంఫోర్డ్ పాఠశాలలో కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఆ రోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు నికట్ 2.0 కొనసాగుతుందని పేర్కొన్నారు.

ఇసుక ధర పెంచితే చర్యలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఇసుక ధర పెంచి అమ్మితే చర్యలు తప్పవని కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ హెచ్చరించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ నూతన ఇసుక పాలసీని పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్, టిప్పర్ యజమానులు అధిక ధర వసూలు చేస్తే 08572–299509 నంబర్‌లో, chittoorsand75@gmail. comకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

ట్రాన్స్‌కో స్టోర్స్ తనిఖీ



సూచనలిస్తున్న ఎస్ఈ సురేంద్రనాయుడు

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో ఉమ్మడి జిల్లా స్టోర్స్‌ను శుక్రవారం ఎస్ఈ సురేంద్రనాయుడు తనిఖీ చేశారు. ప్రస్తుతం నిల్వ ఉన్నవి, అవసరమైన విద్యుత్ పరికరాల వివరాలను డీఈ జయప్రకాష్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాత ఎస్‌పీఎం కార్యాలయం వద్ద నిల్వ చేసిన తుక్కు మీటర్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రయత్నిస్తున్నామని వెల్లడించారు. ట్రిప్పింగ్ సమస్యను అధిగమించేందుకు సెక్షన్ల వారీగా ఏఈలు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈఈలు హరి మునిచంద్ర, డీఈలు శేషాద్రి, కొండయ్య, ఏఈలు వివేకానందరెడ్డి, బాలగురయ్య, మోహన్‌రాజా పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. టైంస్లాట్ టికెట్లు ఉన్న భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. లేని వారికి 18 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

భద్రత ఉంటేనే..



ఆస్పత్రుల్లో పటిష్ట భద్రత కల్పిస్తేనే నిర్భయంగా విధులు నిర్వర్తించగలం. కోల్‌కతా ఘటన మహిళా డాక్టర్లను ఆందోళనకు గురిచేస్తోంది. ప్రస్తుత వాతావరణంలో భయం గుప్పిట్లోనే వైద్య సేవలందించాల్సిన దుస్థితి దాపురించింది. ఆస్పత్రిలో సీసీ కెమెరాలలో కట్టుదిట్టంగా నిఘా పెట్టాలి. మహిళా వైద్యులను ఒత్తిడికి గురిచేయకూడదు. రోగుల వెంట వచ్చే సహాయకులపై నియంత్రణ ఉండాలి. ఒక్కరికే ఎంట్రీ పాస్ జారీ చేయాలి. పరిమిత వేళల్లోనే పరామర్శించేందుకు వచ్చేవారిని అనుమతించాలి. వైద్యులు ప్రశాంతంగా పనిచేసేందుకు భరోసా కల్పించాలి. నైట్ డ్యూటీ చేసే మహిళా వైద్యుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి. ఈ క్రమంలోనే కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై దారుణానికి ఒడిగట్టిన వారిని కఠినంగా శిక్షించాలి.

- గాయత్రి, జూనియర్ డాక్టర్, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, చిత్తూరు

కంటికి రెప్పలా..



దేశ వ్యాప్తంగా మహిళలపై దాడులు, హత్యలు, హత్యాయత్నాలను తరచూ చూస్తున్నాం. ప్రస్తుతంమహిళా ఉద్యోగులు కూడా రక్షణ కరువైంది. రకరకాలుగా ఇబ్బందులకు గురవుతున్నారు. మనుషులు మానవ మృగాలుగా మారుతున్నారు. మహిళల మెడపై వేధింపుల కత్తిపెడుతున్నారు. ప్రధానంగా ఆస్పత్రుల్లో మనిషి ప్రాణాలకు ఊపిరి పోసే మహిళా వైద్యులకు కూడా రక్షణ లేకుండా పోయింది. ఇందుకు నిదర్శనమే కోల్‌కతాలో మహిళ వైద్యురాలి హత్య. ఆస్పత్రుల్లో మహిళా వైద్యులకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఉంది. డ్యూటీ సమయంలో విశ్రాంతి తీసుకోవడానికి కనీస వసతులు ఏర్పాటు చేయాలి. ఈ దిశగా అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టాలి. మహిళా డాక్టర్లు, సిబ్బందిని కంటికి రెప్పలా చూసుకోవాలి. ఇందుకోసం చట్టాలను మరింత కఠినతరం చేయాలి.

- డాక్టర్ నిరంజన్‌రెడ్డి, ఐఎంఏ చిత్తూరు శాఖ అధ్యక్షుడు

బాధ్యత తప్పనిసరి



మహిళా వైద్యులకు రక్షణలో ప్రభుత్వాలు తప్పనిసరిగా తమ బాధ్యత నిర్వర్తించాలి. తెల్లకోటు ధరించిన వారికి మరకలు అంటే పరిస్థితి రాకూడదు. రోగి ఎంతటి బాధలో ఉన్నా వైద్యుడిని చూడగానే వారిలో ధైర్యం వస్తుంది. అలాంటిది ప్రాణం పోసే వారికే రక్షణ లేకుంటే ఇక సమాజంలో మనుగడ సాగించడమే కష్టతరమవుతుంది. మహిళా డాక్టర్ల భద్రతకు భరోసా కల్పించాలి. ప్రశాంత వాతావరణంలో వారు విధులు నిర్వర్తించేలా చర్యలు చేపట్టాలి. వైద్యులపై దాడులను అరికట్టేందుకు చట్టాలను కఠినతరం చేయాలి. కోల్‌కతా ఘటనలో నిందితులకు కఠిన శిక్ష విధించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూడాలి. ఆస్పత్రుల్లో పకడ్బందీగా మౌలిక వసతులు కల్పించాలి.

- చంద్రశేఖర్, జూనియర్ డాక్టర్, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, చిత్తూరు

నష్టాలపాలు

పాడి రైతుపై ప్రభుత్వం పగబట్టింది. సజావుగా సాగుతున్న పాడి పరిశ్రమను కుదేలు చేసింది. 'ప్రైవేట్'కు కలిసొచ్చేలా కుట్రపూరిత ప్రణాళికను అమలు చేసింది. అందులో భాగంగానే అత్యధిక ధరకు పాలు సేకరిస్తున్న అమూల్ సంస్థను బయటకు గెంటేసింది. తక్కువ రేటుకే పాలు పోయాల్సిన దుస్థితిని పాడి రైతులకు కల్పించింది. మాట వినకుంటే నష్టాలపాలు కావాల్సిందే అంటూ భయాందోళనకు గురిచేసింది. ఇదే అదునుగా డెయిరీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. పాల ఉత్పత్తి ఎక్కువగా ఉందనే సాకు చూపించి ధరలను భారీగా తగ్గించేశాయి. రైతుల కష్టాన్ని మూకుమ్మడిగా దోచుకుంటున్నాయి.



పాలు సేకరిస్తున్న ప్రైవేటు డెయిరీల ఏజెంట్లు

జిల్లా సమాచారం

జిల్లాలోని ప్రైవేట్ డెయిరీలు 10	మిల్క్ చిల్లింగ్ సెంటర్లు 60
పాడి రైతులు సుమారు 88వేలు	రోజూ పాల ఉత్పత్తి సుమారు 40 లక్షల లీటర్లు

- జిల్లాలో కుదేలైన పాడి పరిశ్రమ
- 21 నుంచి పాల సేకరణ నిలిపేసిన అమూల్
- సిండికేట్‌గా మారిన ప్రైవేట్ డెయిరీలు
- తగ్గిపోయిన పాల ధరలు
- గిట్టుబాటుకాక ఆందోళనలో పాడి రైతులు
- పట్టించుకోని అధికారులు



పాలను పితుకుతున్న దృశ్యం

పలమనేరు : పది లీటర్ల పాలిచ్చే పశువును కొనాలంటే రూ.లక్షకు పైమాటే. పాడి ఆవును సంరక్షించి పాలను విక్రయిస్తే లీటరుకు దక్కేది సగటున రూ.25 మాత్రమే. అదే పాలను మనం దుకాణాల్లో కొనాలంటే లీటర్‌కు రూ.70 పెట్టాల్సిందే. కనీసం మంచి నీళ్ల సీసాకైనా గ్యారెంటీ ధరలుండగా పాలకు మాత్రం కచ్చితమైన ధరలేదు. డెయిరీల సామర్థ్యానికి మించి పాలు వస్తున్నాయనే సాకును చూపి ధరలను అమాంతం తగ్గించేశారు. తమ వద్ద నున్న మిల్క్ పౌడర్ ఎక్స్‌పైర్ డేట్ సమీపిస్తోందని, ముందుగా వాటిని సేల్ చేశాకే మళ్లీ పాలు కొంటామని డెయిరీల నిర్వాహకులు తెగేసి చెబుతున్నారు. అయితే డెయిరీలన్నీ సిండికేట్‌గా మారి ధరలను తగ్గించాయని రైతులు, పాలను సేకరించే ఏజెంట్లు ఆరోపిస్తున్నారు.

అమూల్‌ను తరిమేసి..

ఇప్పటిదాకా మామిడి గుజ్జు పరిశ్రమల సిండికేట్ చూశాం అదే రీతిలో జిల్లాలోని పాల డెయిరీలు సైతం సిండికేట్‌గా మారి అమూల్ డెయిరీని తరిమేశారనే మాట గట్టిగా వినిపిస్తోంది. ప్రస్తుతం జిల్లాలో దొడ్ల, హెరిటేజ్, పరాగ్, తిరుమల, హట్సన్, సంగం, శ్రీజ తదితర డెయిరీలు పాల ధరను శాసిస్తున్నాయి. ప్రశ్నించేవారు లేకపోవడంతో వారు ఆడిందే ఆట, పాడిందే పాటగా తయారైందని పాడి రైతులు మండిపడుతున్నారు.

కొండెక్కిన ఖర్చు

జిల్లాలో ఎక్కువగా హెచ్ఎఫ్, జెర్సీ రకాల సీమ జాతి ఆవులను రైతులు కొనుగోలు చేస్తున్నారు. వీటిని కర్ణాటక, తమిళనాడుల నుంచి తెచ్చుకుంటున్నారు. లీటరు పాలిస్తే రూ.10వేలు లెక్కన, 10లీటర్ల పాలిచ్చే ఆవును రూ.లక్షకు పైగా వెచ్చించి కొంటున్నారు. పది లీటర్ల పాలిచ్చే ఆవుకు నెలకు 50కేజీల ఫీడ్, ఓ బస్తా బూసా, 30కిలోల గానుగపిండి అవసరముంటుంది. వీటి ధరలు మాత్రం అమాంతం పెరుగుతూనేఉన్నాయి.దీంతో పాడి రైతుకు ఖర్చు కొండెక్కుతోంది.

ఉన్నట్టుండి తగ్గుముఖం

ఎన్నికలకు ముందు వరు ఫ్యాట్ శాతం 3.5, ఎస్ఎన్ఎఫ్ (సోలిడ్స్ నాట్ ఫ్యాట్) 8.5 నుంచి 9శాతం వచ్చే పాలు లీటర్ ధర రూ.44గా ఉండేది. సగటు ధర రూ.40గా ఉండేది. వెన్న శాతం తక్కువగా ఉన్న పాలు లీటర్ ధర కనిష్టంగా రూ.33 దాకా పలికేది. ఇప్పుడు మంచి ఫ్యాట్ ఉన్న పాల ధర రూ.36 కాగా, కనిష్ట ధర రూ.25కు పడిపోయింది. దీంతో సగటు ధర రూ.30కి తగ్గిపోయింది. కూటమి అధికారంలోకి వచ్చినాక లీటర్‌పై రూ.పది దాకా తగ్గడంతో పాడిరైతులకు ఆందోళన తప్పడంలేదు. దీంతోపాటు డెయిరీలకు పంపిన పాలను సైతం నిర్వాహకులు తమకొద్దంటూ వెనక్కి పంపేస్తున్నారు.

సంరక్షణ కష్టమే..



నాకు 5 ఆవులున్నాయి. రోజూ 30 లీటర్ల పాలను డెయిరీకి పోస్తున్నా. గతంలో అమూల్‌కు పోసేప్పుడు లీటర్ రూ.44 గిట్టుబాటు అయ్యేది. ఇప్పుడు రూ.30 కంటే తగ్గింది. ఈ రేట్లతో పాడి ఆవులను మేపడం వేస్టే. ధరల విషయంలో పాల డెయిరీలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయి. పొద్దస్తమాన్నం ఆవులకు చాకిరీ చేసి వాటికి మేత, గానుగపిండి పెట్టి పోషిస్తే మాకూలికూడా మిగలడంలేదు. ఈ రేట్లతో ఆవుల సంరక్షణ కష్టమే.

– జయరామిరెడ్డి, పాడిరైతు, బేరుపల్లె, పలమనేరు మండలం

ఇది మరీ మోసం



నేను 30 ఏళ్లుగా పాల వ్యాపారం చేస్తున్నా. ఇప్పుడున్న దాణా ధరలు, పెరిగిన పాడి ఆవుల రేట్లతో లీటర్‌కు రూ.40పైగా వస్తేనే రైతుకు గిట్టుబాటు ఉంటుంది. ఈ మధ్య వర్షాల కారణంగా పచ్చిమేత లభ్యమవుతోంది. దీంతో పాల ఉత్పత్తి పెరిగింది. తమకు కావాల్సిన పాల కంటే ఎక్కువగా వస్తున్నాయని పాలను డెయిరీ వాళ్లు వెనక్కి పంపుతున్నారు.లీటరు రూ.10 దాకా ధరను తగ్గించేశారు. ధరలు ఇలాగే ఉంటే పాడి పశువులను రైతులు అమ్ముకోవాల్సిందే.

– పాలు శీనా, పాల ఏజెంట్, బైరెడ్డిపల్లె

అమ్మేద్దామనుకుంటున్నా



అప్పుచేసి రెండు ఆవులను రూ.2.20లక్షలు పెట్టి కొన్నా. నెలకు రూ.4వేలు వడ్డీ కడుతున్నా. ఈడ చూస్తే లీటర్ పాల ధర రూ.27 నుంచి రూ.30 మాత్రమే ఉంటోంది. రెండు ఆవులు చేరి పూటకి 15 లీటర్ల పాలిస్తున్నాయి. నెలకు 450 లీటర్లు అనుకున్నా లీటర్ రూ.30 అయితే రూ.13,500 బిల్లు వస్తుంది. ఆవులకు దాణా కోసం నెలకు రూ.7వేలు ఖర్చు, నెల వడ్డీ రూ.4వేలు ఆలెక్కన రూ.11 వేలు ఖర్చుపోతే మిగిలేది రూ.2,500 మాత్రమే. అందుకే ఆవులను అమ్మేద్దామనుకుంటున్నా.

-పాండు, యానాదికాలనీ, పలమనేరు మండలం

తూతూమంత్రంగా గ్రామసభలు

- వేదికలపై పచ్చనేతలకు పెద్దపీట
- పలుచోట్ల దండోరా, నోటీసులు లేకుండా ఏకపక్షంగా నిర్వహణ
- ఒకే రోజు చేపట్టడంతో కొరవడిన ఏర్పాట్లు
- సంక్షేమ పథకాలపై నిలదీసిన గ్రామీణులు



తాటిమాకులపల్లె గ్రామసభలో ఎండ వేడిమికి తాళలేక చెట్ల కిందకు కుర్చీలను తీసుకెళుతున్న మహిళలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా 700 చోట్ల శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలే నేరుగా పాల్గొనే వేదికను గ్రామ సభగా పేర్కొంటారు. ఆర్టికల్ 243ఏ ప్రకారం రాజ్యాంగ బద్ధంగా గ్రామ సభను నిర్వహించాలి. గ్రామంలో ఉన్న ఓటర్లు అందరూ సభలో పాల్గొనవచ్చు. ఇందుకోసం రెండు రోజుల ముందుగా ప్రచారం చేయాలి. దండోర, మూడు ముఖ్య కూడళ్లలో నోటీసు అంటించాలి. , సచివాలయ నోటీస్ బోర్డుపై నోటీసు ప్రదర్శించాలి. అయితే పలమనేరు, కుప్పం, చిత్తూరు, గంగాధరనెల్లూరు నియోజకవర్గాల్లో ఆ నిబంధనలను అమలు చేయలేదు. దీనికితోడు ఒకే రోజు అన్ని గ్రామాల్లో సభలు నిర్వహించడంతో గందరగోళ వాతావరణం ఏర్పడింది. ఉద్యోగులకు సభల నిర్వహణ తలనొప్పిగా మారింది. పోలీసులు విధులు నిర్వహించలేని దుస్థితి వచ్చింది. రాజ్యాంగ బద్ధంగా నిర్వహించాల్సిన గ్రామసభ లక్ష్యాన్ని కూటమి సర్కారు నీరుగార్చింది. ఏకపక్షంగా ఒకేరోజులో తూతూ మంత్రంగా గ్రామసభలను నిర్వహించింది. గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని పెనుమూరు మండలం తాటిమాకులపల్లె నిర్వహించిన గ్రామసభలో ఏర్పాట్లు సరిగ్గా చేయకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఇదే పరిస్థితి జిల్లాలోని పలు గ్రామాల్లో తలెత్తింది.

గళం విప్పిన గ్రామీణులు

కూటమి సర్కారు అధికారంలోకి వచ్చి మూడు నెలలు పూర్తవుతోంది. ఇప్పటి వరకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలేవీ అమలు చేయలేదు. శుక్రవారం నిర్వహించిన గ్రామ సభల్లో పల్లెవాసులు దీనిపై గట్టిగా ప్రశ్నించారు. ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలను ఎప్పుడు అమలు చేస్తారని ప్రజాప్రతినిధులను నిలదీశారు.

వేదికపై అనర్హులు

గ్రామసభలను సర్పంచ్ అధ్యక్షతన నిర్వహించాల్సి ఉంటుంది. ఈ మేరకు పంచాయతీ వార్డు సభ్యులు, కార్యదర్శి, ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీ, జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీలు పాల్గొనాలి. అయితే కుప్పం, పలమనేరు, నగరి, జీడీ నెల్లూరు గ్రామసభల్లో అనర్హులు వేదికను అలంకరించడం వివాదాస్పదంగా మారింది. దీనిపై అధికారులు నోరుమెదపకపోవడం మరిన్ని విమర్శలకు దారి తీసింది.

'సూపర్‌సిక్స్' ఏమైంది సారూ..?

గుడుపల్లె : చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీల మాటేమిటని పలువురు మహిళలు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌ను ప్రశ్నించారు.శుక్రవారం మండలంలోని 18 పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించారు. పెద్ద బదినవాడలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతుండగా సూపర్ సిక్స్ హామీలపై మహిళలు నిలదీశారు. దీంతో తడబాటుకు గురైన ఆయన చంద్రబాబు త్వరలోనే నెరవేరుస్తారంటూ సమాధానం దాటవేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తాజ్ మస్రూర్, తహసీల్దార్ సీతారాం తదితరులు పాల్గొన్నారు.



గుడిపాల మండలం బసవాపల్లె గ్రామసభలో వేదికపై ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ తండ్రి.

గ్రామీణాభివృద్ధికే..



వి.కోట గ్రామసభలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: గ్రామీణాభివృద్ధికే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం వి.కోట సచివాలయం –1 వద్ద పంచాయతీ అధికారులు, కార్యదర్శులతో కలిసి సర్పంచ్ పీఎస్ లక్ష్మి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. జెడ్పీ చైర్మన్ పల్లెలల్లో గుర్తించిన సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని కోరారు. మౌలిక వసతుల కల్పనపై ప్రధానంగా దృష్టి సారించాలని సూచించారు. మండలంలోని 18 పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించినట్లు ఎంపీడీఓ మహ్మద్‌రఫీ తెలిపారు. ఈ క్రమంలోనే బోడిగుట్ల పంచాయితీ గ్రామ సభకు ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డి హాజరయ్యారు. వి.కోట గ్రామసభలో వైస్ సర్పంచ్ అక్మల్ పాల్గొన్నారు.

గ్రామ సభలు పూర్తి

జిల్లాలోని 700 గ్రామాల్లో గ్రామసభలు పూర్తి చేశాం. సమగ్రాభివృద్ధే లక్ష్యంగా గ్రామసభలు నిర్వహించాం. ప్రజలు కోరిన పనులను అనుమతించాం. ఉపాధిహామీ కూలీల హక్కులు, రాజీ లేని అంశాలు, సామాజిక తనిఖీ, మరుగుదొడ్లు, వీధిదీపాలు ఇలా అనేక అంశాలపై చర్చించాం. అంశాల వారీగా ఆమోదించాం.

– సుమిత్‌కుమార్‌గాంధీ, కలెక్టర్,

ఆంధ్రకేసరి సేవలు ఆదర్శనీయం



ప్రకాశం పంతులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఆర్ఓ పుల్లయ్య.

చిత్తూరు కలెక్టరేట్ : ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు సేవలు ఆదర్శనీయమని డీఆర్ఓ పుల్లయ్య కొనియాడారు. టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకుని శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. డీఆర్ఓ మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో జన్మించిన టంగుటూరి ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగారన్నారు.బ్రిటీష్ తుపాకులకు గుండె చూపిన ధీశాలి ప్రకాశం పంతులని వివరించారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ డీడీ రబ్బానీబాషా తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయులు

టంగుటూరి ప్రకాశం పంతులు చిరస్మరణీయులని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు గోపీనాయక్ కొనియాడారు. కళాశాలలో ప్రకాశం పంతులు జయంతి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో ప్రకాశం పంతులు చేసిన సేవలు ఎన్నటికీ మరువలేనివన్నారు. చరిత్ర అధ్యాపకుడు రెడ్డిబాషా మాట్లాడుతూ టంగుటూరి ప్రకాశం సేవానిరతిని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకుడు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆత్మహత్యే శరణ్యం


బాధితుడు సుబ్రమణ్యం రెడ్డి

పలమనేరు : టీడీపీ నేతల కారణంగా ఆత్మహత్యే తనకు శరణ్యంగా మారిందని పలమనేరు నీళ్లకుంటకు చెందిన సుబ్రమణ్యం అలియాస్ మణి శుక్రవారం సాయంత్రం మీడియాకు తెలిపారు. 2018 నుంచి అన్ని శాఖల అనుమతితో మంచినీళ్ల వ్యాపారం చేస్తున్నానన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా పనిచేశానని కక్షగట్టిన టీడీపీ నేతలు మున్సిపల్ కమిషనర్ ద్వారా ట్రాన్స్‌కో ఏడీకి ఫిర్యాదు చేయించి కరెంట్ కనెక్షన్‌ను తొలగించాలని యత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే గనుక జరిగితే ఆత్మహత్య చేసుకోవడం తప్ప గత్యంతరం లేదని వాపోయారు.

రక్షణకే అధిక ప్రాధాన్యం



ఆస్పత్రుల్లో మహిళా వైద్యుల రక్షణకు అధిక ప్రాధాన్యమివ్వాలి. సుప్రీంకోర్టు కూడా ఆదిశగా అభిప్రాయం వ్యక్తం చేసింది. మహిళా డాక్టర్లకు డ్యూటీలో ప్రోటోకాల్ పాటించాలని, సేఫ్టీ టీమ్ ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఈనేపథ్యంలో ఆస్పత్రులను సున్నితమైన ప్రాంతాలుగా గుర్తించి ఆ పరిధి మొత్తాన్ని సేఫ్ జోన్‌గా ప్రకటించాలి. రోగులకు సేవలందించే వైద్యులతో పాటు వైద్యేతర సిబ్బంది భద్రతకు ఇబ్బంది ఉండదు. 11/2008 చట్టం వైద్యులకు రక్షణ కవచం. వైద్యులపై జరిగే దాడులకు సంబంధించి నాన్ బెయిలబుల్ కేసులు నమోదైతే ఒక భయం ఉంటుంది. ప్రజల ఆరోగ్యం కోసం ప్రాణాలకు తెగించి సేవలందించే వైద్యుల రక్షణ కోసం సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ చట్టాన్ని తక్షణమే రూపొందించాలి. సీసీ కెమెరాల సంఖ్యను పెంచాలి. నిఘా వ్యవస్థను పటిష్టం చేయాలి.

– మధుమిత, జూనియర్ డాక్టర్, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, చిత్తూరు

వసతులు అవసరం



సమాజంలో జరుగుతున్న ఘటనలను చూస్తుంటే భయం వేస్తోంది. కచ్చితంగా ప్రతి మహిళా కోరుకునేది పనిచేసే చోట రక్షణ ఉండాలని. భద్రత కల్పిస్తేనే ప్రజారోగ్య దిశగా చూస్తారు. కానీ వారి ఆరోగ్యానికి, ప్రాణానికి ముప్పు వస్తే..ఏం చేయాలో దేవుడికెరుక. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలి. మహిళా వైద్యులు, సిబ్బందికి తోడుగా నిలవాలి. ముఖ్యంగా ఆస్పత్రుల్లో మహిళా వైద్యులకు పూర్తి స్థాయిలో వసతులు కల్పించడం అవసరం. మరుగుదొడ్లు కూడా అధ్వానంగా ఉంటే ఇబ్బందులు తప్పవు. దీనిపై వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలి. సమస్యలను పూర్తిగా పరిష్కరించాలి. సుప్రీంకోర్టు అభిప్రాయం మేరకు ప్రోటోకాల్ పాటించాలి.

– సరోజిని, విశ్రాంత వైద్య ఉద్యోగి, చిత్తూరు

హస్తకళలకు ప్రోత్సాహం


మాట్లాడుతున్న పీడీ తులసి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో హస్తకళలను ప్రోత్సహించాలని డీఆర్డీఏ పీడీ తులసి ఆదేశించారు. చిత్తూరులోని జిల్లా సమాఖ్య సమావేశ మందిరంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ స్థానికంగా ఉన్న వనరులను వినియోగించుకుని హస్తకళా వస్తువులు తయారు చేయాలన్నారు. ప్రస్తుతం హస్తకళలకు మార్కెట్‌లో మంచి ఆదరణ ఉందన్నారు. టెంకాయ పీచుతో బొమ్మలు, మ్యాట్లు, వివిధ రకాల వస్తువులతో ఫ్లవర్వాజులు తయారు చేయాలని సూచించారు. ఇందుకు డీఆర్డీఏ సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. సమావేశంలో ఏపీఎంలు మధుసూదన్, అరుణకుమారి, ప్రమీల, ఉష పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పలమనేరు : గంగవరం మండలం మారేడుపల్లె సమీపంలోని పసలమందలో శుక్రవారం రాత్రి ఓ ఇంట్లో జరిగిన అగ్ని ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ క్రమంలోనే కొట్టంలో కట్టేసిన రెండు ఆవులు మృత్యువాత పడ్డాయి. అగ్ని ప్రమాదానికి కారణం ఇంట్లో నిల్వ చేసిన బాణసంచానే కారణమని తెలుస్తోంది. ఇక్కడ అనధికారికంగా టపాసులు తయారు చేస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



వినూత్న నిరసన

కోల్‌కతా ఘటనపై కుప్పం డిగ్రీ కళాశాల విద్యార్థినులు వినూత్నంగా నిరసన తెలిపారు. ఆధునిక కాలంలోనూ ఆటవిక చర్యలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళల భద్రతకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేయాలి కోరారు. అతివలపై అకృత్యాలను ఏక కంఠంతో ఖండించాల్సిన అవసరముందని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ సాగర్‌రాజ్, ప్రిన్సిపల్ సుధారాణి పాల్గొన్నారు. - కుప్పం రూరల్

ఫ్యాక్టరీ.. నో సేఫ్టీ!

- 2021 పూతలపట్టులోని పాల పరిశ్రమలో అమ్మోనియా గ్యాస్ లీకవడంతో 40 మంది కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. వెంటనే వారిని చిత్తూరులోని జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.
- 2023 యాదమరి పరిధిలోని బ్యాటరీ పరిశ్రమలో ప్రమాదం జరగడంతో రూ.కోట్లలో ఆస్తి నష్ట వాటిల్లింది. అదృష్టవశాత్తు ప్రాణహాని జరగకపోవడంతో ఫాక్టరీ సిబ్బంది ఊపిరిపీల్చుకున్నారు.
- ఇటీవల శ్రీకాళహస్తిలోని స్టీల్ పరిశ్రమలో జరిగిన ప్రమాదరంలో ఇద్దరు కార్మికులు మృత్యువాత పడ్డారు.

ఇవి మచ్చుకు మూడే. గత పదేళ్లలోనే చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని పరిశ్రమల్లో సుమారు 50కిపైగా ప్రమాదాలు సంభవించాయి. ఆయా ఘటనల్లో సుమారు 30 మంది మృతి చెందారు. 10 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. 100 మందికి పైగా అనారోగ్యానికి గురయ్యారు.

- పరిశ్రమల్లో లోపించి భద్రతా ప్రమాణాలు
- నిబంధనలు పాటించని యాజమాన్యాలు
- తనిఖీలకు దూరంగా అధికారులు
- జిల్లాలో ప్రమాదకరంగా మారిన 14 కంపెనీలు
- బిక్కుబిక్కుమంటూ పనిచేస్తున్న కార్మికులు


బ్యాటరీ ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం (ఫైల్)

కార్మికుల భద్రతపై పలు పరిశ్రమల యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. నిబంధనలు తూతూమంత్రంగా పాటిస్తున్నాయి. అధికారుల ఆదేశాలను తుంగలో తొక్కేస్తున్నాయి. లోపాలను సరిచేసుకోకుండా సిబ్బంది ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లోని సడలింపులను ఆసరాగా తీసుకుని ఇష్టారాజ్యంగా ప్రమాణాలను గాలికి వదిలేస్తున్నాయి.

చిత్తూరు కార్పొరేషన్ : అచ్యుతాపురం ఘటనతో జిల్లాలోని పరిశ్రమల పరిస్థితిపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఆయా ఫాక్టరీల్లో పాటించే భద్రతాప్రమాణాలపై ఆందోళన చెందుతున్నారు. ఏదైనా ప్రమాదం సంభవిస్తే కార్మికుల ప్రాణాలకు భరోసా ఏంటని ప్రశ్నిస్తున్నారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో సుమారు 14 ఫ్యాక్టరీలు ప్రమాదకరంగా ఉన్నట్లు అధికారులు నివేదికలు వెల్లడిస్తున్నాయి.

కమిటీ రద్దు

జిల్లా పరిశ్రమలశాఖ, కార్మిక, కాలుష్య నియంత్రణ మండలి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, జిల్లా అగ్నిమాపకశాఖ అధికారుల కమిటీ 2022లో ప్రమాదకర కంపెనీలను తనిఖీ చేసింది. ఆయా పరిశ్రమల్లో భద్రతా లోపాలను గుర్తించి నోటీసులను జారీ చేసింది. తర్వాత రెండేళ్లుగా కంపెనీల్లో తనిఖీలు జరగలేదు. ప్రమాదాలు మాత్రం పరిశ్రమల్లో జరుగుతూనే ఉన్నాయి. ప్రస్తుతం ఆ కమిటీని కూడా ప్రభుత్వం రద్దు చేసేసింది. దీంతో ఫ్యాక్టరీ యాజమాన్యాలు ఆడింది ఆట.. పాడింది పాటగా మారనుంది.

మానవ తప్పిదాలతోనే..

గతంలో పరిశ్రమలు, ఫ్యాక్టరీల్లో అధికారులు తనిఖీలు చేసినప్పుడు పలు లోపాలను గుర్తించారు. అగ్నిమాపక పరికరాలు లేకపోవడం. లూజ్ వైరింగ్ వంటి ఎలక్ట్రికల్ లోపాలను గుర్తించారు. అలాగే పర్సనల్ ప్రొటెక్షన్ ఎక్విప్‌మెంట్ కిట్‌లను కూడా కార్మికులకు సక్రమంగా ఇవ్వడం లేదు. కొన్ని కంపెనీలు కిట్‌లను పంపిణీ చేసినా వాటిని వినియోగించేలా కార్మికులకు అవగాహన కల్పించలేదు. పలు పరిశ్రమల్లో యంత్రాల నిర్వహణను పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలో మానవతప్పిదాలతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నట్లు అధికారులు తమ నివేదికలో పేర్కొన్నారు.

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని ఫ్యాక్టరీల సమాచారం

మొత్తం పరిశ్రమలు	:	1,900
అందులో ఫార్మా ఫ్యాక్టరీలు	:	20
ప్రమాదకరమైనవి	:	14
భద్రత,నిర్వహణపై నమోదైన కేసులు	:	సుమారు 100
కోర్టుల్లో జరిమానా విధించినవి	:	16


పలమనేరులోని పారిశ్రామికవాడ

నిబంధనల్లో లోపాలు

2016లో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కింద రాష్ట్ర ప్రభుత్వం కొన్ని చట్టాలు తెచ్చింది. దీని ప్రకారం సంబంధిత అధికారులు నేరుగా వెళ్లి పరిశ్రమలు, ఫ్యాక్టరీలను తనిఖీ చేయకూడదు. దీంతో పరిశ్రమల భద్రత, నిర్వహణ, కార్మిక సంక్షేమం గురించి నేరుగా ఆరా తీసే పరిస్థితి అధికారులకు లేకుండా పోయింది. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే గానీ తనిఖీలకు వెళ్లలేని దుస్థితి దాపురించింది. ఈ క్రమంలో ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న సంఘటనల దృష్ట్యా తిరిగి భద్రతా కమిటీలను ఏర్పాటు చేసి తనిఖీలు చేయాల్సి ఉందని పలువురు కోరుతున్నారు.

పర్యవేక్షణ తప్పనిసరి

ఏ సమయంలో ఏ రూపంలో ప్రమాదం వస్తుందో తెలియదు. అందుకని పరిశ్రమల్లో పనిచేసే వారు జాగ్రత్తలు పాటించాలి. ప్రమాదకర వస్తువులను తయారుచేసే ఫ్యాక్టరీలు తమ కార్మికుల పనులు, యంత్రాల నిర్వహణపై తప్పనిసరిగా పర్యవేక్షిస్తుండాలి. అలాగే అవసరమైనప్పుడు కార్మికులకు శిక్షణ, అవగాహన కల్పిస్తుండాలి. పరికరాలను మోతాదుకు మించివాడితే ప్రమాదం. ఉద్యోగులకు క్రమం తప్పకుండా ఆర్యోగ పరీక్షలు చేయించాలి.

- రామకృష్ణారెడ్డి, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్

విద్యుదాఘాతంలో ట్రాన్స్‌కో ఉద్యోగి మృతి

విజయపురం : మండలంలోని పన్నూరులో శుక్రవారం విద్యుదాఘాతంతో ఫీల్డ్ అసిస్టెంట్ మృతి చెందాడు. వివరాలు.. నగరి రూరల్ మండలం మిట్టపాళానికి చెందిన వాసు (36) పన్నూరుకు చెందిన రైతు పొలంలో విద్యుత్ సమస్య రావడంతో శుక్రవారం ఏఈ, ఎల్ఎం, సిబ్బంది వెళ్లారు. ఎల్‌సీ తీసుకున్న తర్వాత వాసు పోల్ ఎక్కాడు. అయితే కరెంట్ సరఫరా ఆగకపోవడంతో షాక్ తగిలింది. గాయపడిన వాసును అధికారులు వెంటనే నగరి ప్రభుత్వ ఆస్పత్రి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీనిపై తమకు సమాచారం లేదని పోలీసులు తెలిపారు.


మృతి చెందిన వాసు

అనాథలైన పిల్లలు

నగరి రూరల్ మండల మిట్టపల్లెకు వాసుకు, ఇరుగువాయికి చెందిన గుండి మల్లితో నాలుగేళ్ల క్రితం పెళ్లి అయింది. వీరికి ఇద్దరు మగ పిల్లలు. వాసు మృతితో కుటుంబం వీధిన పడిందని బంధువులు కన్నీరు మున్నీరవుతున్నారు. అతను ఉదయం చనిపోతే రాత్రి వరకు అధికారులు సమాచారం ఇవ్వలేదని, అధికారుల నిర్లక్ష్యం వల్లే వాసు మృతిచెందాడని ఆరోపిస్తున్నారు.

నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి


గుంతలో బైక్‌తోపాటు వేలాయుధం మృతదేహం

చిత్తూరు అర్బన్ : కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. దర్యాప్తులో పోలీసుల నిర్లక్ష్యం కారణంగా ఓ నిండు ప్రాణం బలైంది. వివరాలు.. తమిళనాడులోని అరక్కోణం పట్టణానికి చెందిన వేలాయుధం(43) తన కుమార్తెను చిత్తూరులోని ఓ నర్సింగ్ కళాశాలలో చేర్పించాడు. ఈ క్రమంలో ఈ నెల 20వ తేదీన కుమార్తెను కాలేజీలో వదలిపెట్టి తిరుగుప్రయాణమయ్యాడు. అయితే ఇంటికి రాకపోవడంతో 21వ తేదీన వేలాయుధం భార్య సుభాషిణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. మగవాడు ఎక్కడికి వెళతాడులే అని పోలీసులు దర్యాప్తు చేయడంలో నిర్లక్ష్యం చూపించారు. తీరా శుక్రవారం చిత్తూరు శివారులోని గోపాలపురం వద్ద జాతీయరహదారి పక్కనే ఓ గుంతలో వేలాయుధం మృతదేహం లభ్యమైంది. దుర్వాసన వస్తుండడంతో స్థానికులు సమాచారం అందించగా అక్కడు చేరుకున్న పోలీసులు గుర్తింపుకార్డు ద్వారా వేలాయుధం మృతదేహమే అని నిర్ధారించారు. జాతీయరహదారిపై విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయడానికి తీసిన గుంతలో పడి వేలాయుధం మరణించాడు. మూడు రోజులు గడిచిపోవడంతో శరీరం కుళ్లిపోయి గుర్తుపట్టలేని స్థితికి చేరుకుంది. విద్యుత్ స్తంభం నాటేందుకు తీసిన గుంతను కాంట్రాక్టర్ పూడ్చించకపోవడం, కనీసం సూచిక బోర్డు కూడా ఏర్పాటు చేయకపోవడంతోనే ఒకరి ప్రాణం పోయిందని స్థానికులు ఆరోపించారు. వేలాయుధం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వేటగాడి అరెస్ట్


నిందితుడి అరెస్ట్ చూపుతున్న అటవీశాఖ అధికారులు

పుంగనూరు : మండలంలోని షికారీపాళానికి చెందిన అంకయ్య అనే వేటగాడిని శుక్రవారం అరెస్ట్ చేసినట్లు ఎఫ్ఆర్ఓ శ్రీరాములు తెలిపా రు. నిందితుడు తన ఇంట్లో దాచిన ఒక నక్షత్ర తాబేలు, నాటు తుపాకీ ని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. వన్యప్రాణులను వేటాడడం, విక్రయించడం నేరమని స్పష్టం చేశారు. దాడిలో సెక్షన్ ఆఫీసర్ రాకేష్‌కుమార్, సిబ్బంది కిరణ్ కిషోర్, రాజశేఖర్, శోభనాద్రి, యువరాజు, శ్రీనివాసులు, రాధమ్మ పాల్గొన్నారు.

జంట ఆత్మహత్యాయత్నం

- 19 ఏళ్ల యువకుడితో వివాహితకు స్నేహం
- తిరుమల నుంచి కాలినడకన వస్తూ పురుగుల మందు తాగిన జంట
- ఆస్పత్రికి తరలింపు



అపస్మారక స్థితిలో ఉన్న సతీష్, రుయాలో చికిత్స పొందుతున్న రాధిక

చంద్రగిరి : పాతికేళ్ల వివాహిత.. 19 ఏళ్ల యువకుడితో స్నేహంగా ఉంటోంది. ఇద్దరూ మూడు రోజుల క్రితం తిరుమలకు వెళ్లారు. శుక్రవారం కాలినడకన శ్రీనివాసమంగాపురానికి వస్తూ మార్గం మధ్యలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. వివరాలు.. చిత్తూరు కొంగారెడ్డిపల్లెకు చెందిన రాధిక(25) కూలి పనులు చేసుకుంటూ భర్త, ముగ్గురు పిల్లలతో జీవనం సాగిస్తోంది. అదే ప్రాంతానికి సతీష్(19)తో కొంత కాలం కిందట పరిచయం ఏర్పడింది. ఇద్దరూ ఎవరికీ చెప్పకుండా బయలుదేరి తిరుమలకు వెళ్లారు. శ్రీవారి దర్శనానంతరం ఇద్దరూ కాలినడకన కొండదిగుతుండా ఏం జరిగిందో ఏమో తెలియదుగానీ వెంట తెచ్చుకున్న పురుగుల మందును తాగేశారు. ఈ విషయాన్ని శ్రీవారి భక్తులు గమనించి.. టీటీడీ విజిలెన్స్ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు హుటాహుటిన ఇద్దరినీ కిందికి తీసుకొచ్చారు. అప్పటికే వారి ఆచూకీ కోసం గాలిస్తున్న రాధిక భర్త, సతీష్ బంధువులు శ్రీవారిమెట్టు వద్దకు చేరుకున్నారు. వారిద్దరినీ తిరుపతి రుయాకు తరలించి వైద్యం అందిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'టెట్రా' గాజులోయ్!


నిందితుడిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

పలమనేరు : గంగవరం సమీపంలో గాజుల వ్యాపారి నుంచి కర్ణాటక టెట్రా ప్యాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వివరాలు.. గంగవరం మండలం నలసానపల్లెకు చెందిన బాబు గాజులను విక్రయిస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. అయితే గాజుల కింద టెట్రా ప్యాకెట్లు తరలిస్తూ విక్రయించేవాడు. ముందస్తు సమాచారంతో పోలీసులు నిఘా పెట్టి నిందితుడిని అరెస్ట్ చేశారు. నిందితుడి బైక్‌పై గాజుల కింద దాచి ఉంచిన రూ.30 వేల విలువైన 432 టెట్రా ప్యాకెట్లు సీజ్ చేశారు.

కక్షతోనే అసత్య కథనాలు


విలేకర్లతో మాట్లాడుతున్న వెంకటరెడ్డి యాదవ్

పుంగనూరు : రాజకీయ కక్షతోనే ఎల్లోమీడియా అసత్య కథనాలు ప్రచురిస్తోందని, తమను మాజీ మంత్రి పెద్దిరెడ్డి బినామీలుగా చిత్రీకరిస్తోందని వైఎస్సార్‌సీపీ నేత వెంకటరెడ్డి యాదవ్ మండిపడ్డారు. శుక్రవారం పుంగనూరులో ఆయన విలేకర్లతో మాట్లాడారు. బ్రిటీష్ కాలంలో నమోదైన సర్వే నెంబరు 22లోని 982.48 ఎకరాల భూమి తమ పూర్వీకుల కాలం నుంచి రాగానిపల్లెలో ఉందన్నారు. అది ప్రభుత్వ భూమి కాదని, ప్రైవేటు వ్యక్తులకు చెందిందని వెల్లడించారు. సుమారు 50 ఏళ్లుగా కోర్టుల్లో పోరాటం చేసి కేసు గెలిచామన్నారు. ప్రభుత్వమే లిటిగేషన్లు పెట్టి, భూమి రికార్డులను తప్పుపట్టడం హస్యాస్పదమని విమర్శించారు. రాగానిపల్లె దాఖలాలోని ఈ భూమిని పుంగనూరు జమీందారు వంశస్తుల నుంచి తమ పూర్వీకులు కొనుగోలు చేశారని తెలిపారు. తదనంతరం అవసరాల నిమిత్తం పలువురికి విక్రయించారని వివరించారు. సమావేశంలో భూ యజమానులు బుడ్డారెడ్డి యాదవ్, చంద్రారెడ్డి యాదవ్, నాగరాజ యాదవ్, గోపీయాదవ్, రెడ్డెప్పరెడ్డి యాదవ్ తదితరులు పాల్గొన్నారు. మా ప్రైవేటు భూములపై కుట్ర చేసి అధికారులు రికార్డులు మార్చినట్లు పేర్కొనడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో కాలిపోయిన రికార్డుల్లో రాగానిపల్లె భూముల పత్రాలు ఉన్నాయని ఎల్లోమీడియా పేర్కొనడం అసత్యమని స్పష్టం చేశారు. పుంగనూరు రికార్డులు పలమనేరు ఆర్డీఓ పరిధిలో ఉన్నాయని వెల్లడించారు.

ప్రభుత్వ ఉత్తర్వులు మాయే!

చిత్తూరు కలెక్టరేట్ : పాఠశాలల్లో మరుగుదొడ్ల ఫొటోలు తీసే బాధ్యత టీచర్లకు తప్పిస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వుల పేరిట మాయచేసిందని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ ఆరోపించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వులు మూడు రోజుల ముచ్చటగా మిగిలాయన్నారు. . ప్రస్తుతం ఆ బాధ్యతలను నూతనంగా ఎంపికై న పాఠశాల యాజమాన్య కమిటీకి అప్పగించారని విమర్శించారు. మళ్లీ ఆ రిపోర్టు ప్రతి రోజూ ప్రధానోపాధ్యాయులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారని మండిపడ్డారు. తక్షణమే ఆ ఉత్తర్వులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. టీచర్లకు బోధనేతర పనులను అప్పగించకూడదని కోరారు.

లైంగిక దాడి కేసులో నిందితుడి అరెస్ట్

చిత్తూరు అర్బన్: చిత్తూరులో ఓ మైనర్ బాలికపై లైంగిక దాడి పాల్పడిన కేసులో నిందితుడిని శుక్రవారం టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు.. తేనెబండ పక్కనున్న బోడిగుట్టకు చెందిన నవీన్ అనే వ్యక్తి ఓ మహిళతో సహజీవనం చేస్తున్నాడు. ఆమె కుమార్తె (14)తో కలిసి ఒకే ఇంట్లో ఉంటున్నాడు. తాను పనికెళ్లేచ్చే సరికి బాలిక ఏడుస్తోందని..అడిగితే తనపై నవీన్ లైంగిక దాడికి చేసినట్లు చెప్పిందని బాధితురాలి తల్లి పోలీసులను ఆశ్రయించింది. ఈమేరకు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ నెట్టికంఠయ్య తెలిపారు.

ఆయా మృతిపై విచారణకు ఆదేశాలు

కుప్పంరూరల్ : మండలంలోని పరమసముద్రంలో ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల ఆయా సెల్వి(55) మృతిపై రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్‌ప్రసాద్ శుక్రవారం విచారణకు ఆదేశించారు. మృతురాలి భర్త మునిరత్నం ఫిర్యాదు మేరకు ఎస్పీ మణికంఠకు ఉత్తర్వులు జారీ చేశారు. సెల్వి మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు.

కోలుకుంటున్న విద్యార్థులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు అపోలో కాలేజీలో అతిసార బారిన పడిన విద్యార్థులు కోలుకుంటున్నారు. ఇప్పటికే చాలా మంది ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. దీంతో అపోలో యజమాన్యం ఊపిరిపీల్చుకుంటోంది. ప్రస్తుతం ఏడుగురు విద్యార్థులు మాత్రమే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు అధికారులు తెలిపారు. అయితే ఆర్ఆర్‌టీ బృందం అతిసార కారణాలను శనివారం వెల్లడించనున్నట్లు తెలుస్తోంది.